క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

అయిజ: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయిప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికతో హాజరుకావాలని సూచించారు.

కరపత్రాలు విడుదల



అయిజ: పట్టణంలోని వివిధ కాలనీల్లో గురువారం డీఎస్పీ (ధర్మ సమాజ్ పార్టీ)కి సంబంధించి కరపత్రాలను డీఎస్పీ నాయకులు విడుదల చేశారు. ఈసందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మాట్లాడారు. పూలే, అంబేడ్కర్, కాన్సీరాం ఆశయాలను సాధిద్దామన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ ప్రచార నాయకులు లక్ష్మణ్, మహారాజ్, భరత్, శాంతిరాజు, సునిల్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: బహుజన రాజ్యాధికారం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏకం కావాలని ధర్మ సమాజ్ పార్టీ ప్రచార నాయకులు లక్ష్మణ్ మహరాజ్ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతి నగర్‌లో గురువారం ధర్మ సమాజ్ పార్టీ కరపత్రాన్ని విడుదల చేశారు. పూలే, అంబేడ్కర్, కాన్సీరాం ఆశయాల సాధనకోసం డీఎస్పీ పార్టీ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో భాస్కర్, నరేష్, మహేష్, రవి, నాగరాజు, అజయ్, శాంతికుమార్, ప్రవీణ్ మహరాజ్‌లు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు



ధరూరు: మండల కేంద్రంలో ఇమ్యూనైజేషన్ డే కార్యక్రమానికి మంచి స్పందన లభించినట్లు ఏఎన్ఎం చంద్రకళ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 45 రోజుల పిల్లల నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు టీకాలు వేశారు. టీకాలతో రోగనిరోధక శక్తి పెరుగుతోందన్నారు. ప్రతివారం వేస్తామని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సమత, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని నిరసన

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని చైతన్య పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ సతీష్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ పాఠశాలలో పుస్తకాలు పట్టుకొని ఏబీవీపీ నాయకులు నిరసన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఏంఈఓ సురేష్ పాఠశాలకు చేరుకున్నారు. ఏబీవీపీ నాయకులు ఏంఈఓ కారుకు అడ్డంగా కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో అశోక్, సురేష్, గణేష్, వంశీ, నరేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థికి కలెక్టర్ అభినందన



గద్వాల రూరల్: నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్‌కు అర్హత సాధించిన గట్టు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి వీరేష్‌ను కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం తన చాంబర్‌లో అభినందించారు. ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు.

సన్మానం



గట్టు: మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వీరేష్, కుమార్‌లు నీట్‌లో ప్రతిభ చాటారు. ఈ మేరకు గురువారం ఎంపీపీ విజయ్‌కుమార్ విద్యార్థులను అభినందించి సన్మానించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ నీట్‌లో ప్రతిభ చాటి అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. కష్టపడి చదువితే ఎవరికైనా ర్యాంకులు సాధ్యమని నిరూపించారన్నారు. జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మల్లేష్, హనుమేష్, వార్డు సభ్యుడు మల్లేష్, రంగన్న, శివప్ప, రామాంజనేయులు, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో పల్లెల పాలన

- చెట్లకిందే సభలు, సమావేశాలు
- రికార్డుల భద్రతకు తప్పని తిప్పలు.



ఎర్రవల్లిలో బీసీ కమ్యూనిటీ హాలులో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

ఎర్రవల్లిచౌరస్తా: పరిపాలన సౌలభ్యం కోసం నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 2018 సంవత్సరంలో మార్చిలో అనుబంధ గ్రామాలతో పాటు 500 మంది జనాభాను కలిగి ఉన్న గ్రామాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. పారదర్శక పాలన అందించేందుకు, పల్లెల అభివృద్ధి కోసం పంచాయతీ కార్యదర్శుల నియామకాలను కూడా చేపట్టింది. కొత్త పంచాయతీల ఏర్పాటు తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరగడంతో కొత్త పాలన ప్రారంభమైంది. అంతాబాగానే ఉన్నా పంచాయతీలకు పక్కా భవనాలు లేక ప్రజాప్రతినిధులు నానా అవస్థలు పడుతున్నారు. కొత్త పంచాయతీలకు ప్రభుత్వ భవనాలను ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో పల్లెల్లో పాలకులకు ఇబ్బందులు తప్పడంలేదు. దీనివల్ల అద్దెగదులు, మూతపడ్డ పాఠశాలలు, కమ్యూనిటీ భవనాల్లో కొత్త పంచాయతీల పాలన కొనసాగడం గమనార్హం. పంచాయతీల్లో సర్పంచులు తమ పాలకవర్గ సభ్యుల సమావేశాలు, గ్రామసభలను చెట్టకిందనే నిర్వహించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.



ఎంఆర్ చెర్వులో కమ్యూనిటీహాల్‌లో పంచాయతీ భవనం

మండలాల వారీగా పంచాయతీ భవనాల వివరాలు ఇలా....

మండలం	జీపీలు	పక్కా భవనాలు	ఇతర భవనాలు
ఇటిక్యాల	29	23	06
మానవపాడు	16	15	01
అలంపూర్	14	08	06
ఉండవెల్లి	16	14	02
వడ్డేపల్లి	10	07	03
రాజోలి	11	08	03
అయిజ	28	16	12

ఇతర భవనాల్లోనే కొత్త పంచాయతీలు..

అలంపూర్ నియోజకవర్గంలోని 7 మండలాల్లో మొత్తం 124 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 91 పంచాయతీలకు మాత్రమే ప్రస్తుతం ప్రభుత్వ భవనాలు కలవు. మిగిలిన 33 పంచాయతీలకు ఎలాంటి ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో ఇతర భవనాలలోనే పాలనను కొనసాగిస్తున్నారు. ఇందులో ఏ ఒక్క పంచాయతీకి కూడా పూర్తి సౌకర్యాలున్న భవనం లేదు. దీనివల్ల సభలను ఏర్పాటు చేయాలంటే అధికారులు, పాలకులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మూతపడ్డ భవనాలు, శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు, కమ్యూనిటీ హాలులలోనే అరకొర వసతుల మధ్య పంచాయతీల పాలనను బిక్కు బిక్కుమంటూ ముందుకు సాగిస్తున్నారు.

భద్రతకు తప్పని ఇబ్బందులు...

పక్కా భవనాలు లేని పంచాయతీలలో రికార్డుల భద్రత గాలిలో దీపంలా మారుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వసతులు కూడా లేకపోవడంతో రికార్డులను భద్రపరిచేందుకు కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస వసతులైన మూత్రశాలలు, బీరువాలు, కుర్చీలు, టేబుల్స్ కూడా కొన్ని జీపీల్లో లేకపోవడంతో పాలకవర్గం అవస్థలు పడుతుంది. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికి సమస్య పరిష్కారం కాలేదు. మహిళా కార్యదర్శుల అవస్థలు మాత్రం అధికారులతో చెప్పేందుకు దయనీయంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కొత్త పంచాయతీలకు అవసరమైన శాశ్వత భవనాలను తక్షణమే నిర్మించాలని పాలకవర్గాలు కోరుతున్నాయి.

సమావేశాలకు ప్రజలు వెనకడుగు..



గ్రామ పంచాయతీకి శాశ్వత భవనం లేకపోవడంతో సమావేశాలను నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం. పాలకవర్గం, గ్రామస్తులు కూర్చోవడానికి కూడా సరైన స్థలం లేకపోవడంతో సభలకు వచ్చేందుకు ప్రజలు వెనకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా నూతన పంచాయతీలకు కొత్త భవనాలను ఏర్పాటు చేయాలి.

– రవి, సర్పంచ్, ఎర్రవల్లి

శాశ్వత భవనాలను నిర్మించాలి..



నూతన పంచాయతీలకు శాశ్వత భవనాలు లేకపోవడంతో గ్రామ సభను నిర్వహించడం కోసం పాలకులు, ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా పంచాయతీలలో సమావేశాల నిర్వహణకు, రికార్డుల భద్రపరిచేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నూతన పంచాయతీలకు శాశ్వత భవనాలను నిర్మించాలి.

– పావని, సర్పంచ్, శనిగపల్లి

ప్రభుత్వానికి నివేదించాం..



మండలంలో నూతనంగా ఆరు గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు పక్కా భవనాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం. అందుబాటులో ఉన్న భవనాల్లో, ఖాళీగా ఉన్న ఇండ్లలో పంచాయతీ కార్యాలయాలను ఏర్పాటు చేశాం. శాశ్వత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వానికి నివేదికలను తయారుచేసి పంచించాం. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– భాస్కర్, ఎంపీవో, ఇటిక్యాల

ఉపాధి కూలి చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న రేపల్లె దేవదాసు

మల్దకల్: ఉపాధి కూలీలకు పెండింగ్‌లో బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపల్లె దేవదాసు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు కనీస కూలి రూ. 600 ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం 55 సంవత్సరాలు నిండిన ప్రతి కూలీకి పెన్షన్ మంజూరు చేయాలని, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహా, నాయకులు సామేల్, పాంటన్న, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం పురపాలిక కార్యాలయంలో మటన్, చికెన్, కూరగాయలు, పండ్ల వ్యాపారులతో సమావేశమయ్యారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకం అధికం అయిందని, దీని కారణంగా పర్యావరణానికి ముప్పు వాటిల్లడంతో ఎన్నో రకాల అనర్థాలకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మటన్, చికెన్ వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడే పారబోస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోందని మండిపడ్డారు. వ్యర్థాలను చెత్తబండ్లకే ఇవ్వాలని, ప్లాస్టిక్ వాడితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

నేడు పట్టణ ప్రగతి

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జెండా ఆవిష్కరణ, ముగ్గుల పోటీలు, ప్రగతి నివేదిక, ర్యాలీ, కార్మికులకు సన్మానం తదితర కార్యక్రమాలు శుక్రవారం చేపడుతున్నామని, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని చైర్‌పర్సన్ గాయత్రి కోరారు.

అసత్య ప్రచారాలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలేష్

గద్వాల అర్బన్: అసత్య ప్రచారాలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాహక్కు చట్టాన్ని ప్రైవేట్ పాఠశాలలు తుంగలో తొక్కుతున్నాయని ఆరోపించారు. రంగు రంగుల కరపత్రాలు, టెక్నో, కాన్సెప్ట్ ఆకర్షణీయమైన పేర్లతో ప్రచారాలు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారన్నారు. పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందని వివరించారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మన్యం, రాజు, మనోహర్, ప్రవీణ్, ప్రకాష్, రవి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

వాల్మీకి ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న వీరుబాబు

కేటీదొడ్డి: మండలంలోని ఇర్కిచేడులో నూతనంగా నిర్మిస్తున్న వాల్మీకి ఆలయ నిర్మాణానికి రూ.1,00116 కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీరుబాబు వాల్మీకి నాయకులకు గురువారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి అందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అడ్వకేట్ శివరాజ్, డీలర్ జంగిలప్ప, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్

రాజోళి: మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుడి సమీపంలో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు పనులను గురువారం జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్ ప్రారంభించారు. జెడ్పీ నిధుల నుంచి మంజూరైన నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రోడ్డు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని దీంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామస్తులు సహకరించాలని కోరారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని శివారులో లారీని కారు ఢీకొట్టిన ఘటనలో కారులో ఉన్న సంతోష్ అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన విదితమే. ఈ సంఘటనపై గురువారం లారీ డ్రైవర్ ముస్తకీన్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ ఖాజా హుస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. లారీ ఢిల్లీ నుంచి బెంగుళూరుకు ప్లాస్టిక్ లోడ్‌తో వెళ్తుందని వివరించారు. లారీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయండి

అయిజ: మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆవరణలో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు కర్నూలు–రాయచూరు రోడ్డు సర్కిల్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ ప్రారంభించి 11 గంటలకు తెలంగాణ చౌరస్తా వద్ద మానవహారం, పట్టణ ప్రగతి థీం సాంగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ, అదేవిధంగా వివిధ కేటగిరిల వారిగా ఉత్తమ ప్రదర్శన చేసినవారికి ప్రశంసపత్రాల పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ఆర్పీలు, ఉద్యమకారులు, పుర ప్రముఖులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న కంటి వెలుగు

గట్టు: మండలంలోని మాచర్లలో కంటి వెలుగు శిబిరం కొనసాగుతోంది. గురువారం మొత్తం 148 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, ముగ్గురికి అద్దాలను పంపిణీ చేశారు. ఐదుగురికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు సీహెచ్ఓ ఊసేని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాయికిరణ్, హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు తప్పనిసరి



ఎద్దుకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

శాంతినగర్: వానాకాలంలో పశువులకు సంక్రమించే గొంతువాపు, జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని వీఎల్ఓ వరప్రసాద్ రైతులను కోరారు. వడ్డేపల్లి మండలంలోని కొంకలలో డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. 23 మంది రైతులకు సంబంధించిన 140 గేదెలు, 55 ఆవులకు టీకాలు వేసినట్లు వీఎల్ఓ తెలిపారు.

ఘనంగా పల్లె ప్రగతి సంబరాలు



కలుకుంట్లలో భూమి పూజలో పాల్గొన్న సర్పంచ్

కేటీదొడ్డి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 14వ రోజు గురువారం పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం రూ.20 లక్షల వ్యయంతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోరమ జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు హనుమంతు, పార్టీ మండల అధ్యక్షుడు ఉరుకుందు, నాయకులు చక్రధర్, గోవిందు, నసీర్, యుగందర్, తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయా గ్రామాల సర్పంచ్‌లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, నాయకులు కులకర్ణి రవి కుమార్, నాయకులు ఆంజనేయులు, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పలు గ్రామాల్లో పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం కార్మికులను సన్మానించారు. సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

శాంతినగర్: పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్మికులకు హ్యాండ్‌వాష్, సబ్బులు, నూనె, బూట్లు తదితర వస్తు సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ట్రాక్టర్‌లను పూలమాలలతో అలంకరించారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతన్న, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చిన్నపోతులపాడులో పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులతో కలిసి ఎంపీడీఓ రమణారావు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జాతీయ జెండాను ఆవష్కరించారు.

ధరూరు: మండల కేంద్రంతో పాటు నీలహళ్లి, ర్యాలంపాడు, చింతరేవుల, బూరెడ్డిపల్లి, జాంపల్లి తదితర గ్రామాల్లో పల్లె ప్రగతి దినోత్సవంలో భాగంగా సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులతో కలిసి జెండా ఎగురవేశారు. అనంతరం పంచాయతీ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బండ్ల జ్యోతి, పద్మమ్మ, మహబూబ్, శాంతమ్మ, గణపతి, కర్రెమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



కేటీదొడ్డి నూతన పంచాయతీ భవనానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మానవపాడు: మండలంలోని కలుకుంట్లలో పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా కొత్త గ్రామ పంచాయతీకి సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఆత్మలింగారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్ నరేందర్, కార్యదర్శి సురేష్, గ్రామస్తులు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంతో పాటు ఎల్కూర్, అమరవాయి, కుర్తిరావల్‌చెర్వు, నీలిపల్లి, మద్దెలబండ గ్రామాలలో పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామసభలు ఏర్పాటు చేశారు. అనంతరం ఎంపీడీఓ కృష్ణయ్య జెండా ఆవిష్కరణ చేశారు. పంచాయతీ కార్మికులకు ప్రశాంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు యాకోబు, రాధ, పద్మమ్మ, జయమ్మ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని బల్గెరలో పల్లె ప్రగతి దినోత్సవంలో భాగంగా జాతీయ పతాకాన్ని గ్రామ పంచాయతీ కార్మికులను సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు హనుమంతు ఆవిష్కరించారు. అనంతరం పంచాయతీ కార్మికులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీలో కార్యదర్శి జగన్నాథరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం కార్మికులను కోఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ సన్మానించారు.



బల్గెరలో పంచాయతీ కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్ హనుమంతు



శాంతినగర్‌లోని బుడమరుసులో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీఓ రవీంద్ర



మానవపాడులోని చిన్నపోతులపాడులో..



ధరూరులో కార్మికులను సన్మానించిన సర్పంచ్ పద్మమ్మ

మద్యం పట్టివేత



కేటీదొడ్డి: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం గురువారం మండలంలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలోని వాహనాలు తనిఖీలు చేపట్టారు. రాయచూర్ నుంచి జమ్మన్నతో మరో ఇద్దరు వ్యక్తులు నాలుగు బీర్ బాటిళ్లు, ఏడు విస్కి, టెట్రా ప్యాకెట్లు అక్రమంగా తరలిస్తున్నాడు. తనిఖీలో గోవా మద్యాన్ని గుర్తించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లె ప్రగతి అంటూ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట జాతీయ పతాకం ఎగుర వేసి సంబురాలను జరుపుకోవడం వింతగా ఉందన్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి తీర్చలేని పాలకులు ఉత్సవాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. చెత్తను ట్రాక్టర్ ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఓవర్ హెడ్‌ట్యాంకులను నెలకు ఒకసారైనా శుభ్రపరచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు.